EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
గురువారం
03-07-2025
పేజీలు: 02






# హరిహర వీరమల్లు ట్రైలర్ రిలీజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'హరి హర వీర మల్లు: పార్ట్ 1-స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. జూలై 24, 2025న వరల్డ్ వైడ్‌గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. హిందువుగా జీవించాలంటే పన్ను కట్టాల్సిన సమయం. ఈ దేశ శ్రమ బాద్‌షా పాదాల కింద నలిగిపోతున్న సమయం. ఒక వీరుడు కోసం పకృతి పురుడు పోసుకుంటున్న సమయం. అన్న డైలాగ్స్‌తో ఈ ట్రైలర్ మొదలవుతుంది. ట్రైలర్ చూస్తుంటే.. 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం ఔరంగజేబు కాలం నేపథ్యంలో తెరకెక్కిన సినిమాల కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ ఇందులో వీరమల్లు అనే యోధుడి పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, నాజర్, నార్గిస్ ఫక్రీ, అనుపమ్ ఖేర్, సుబ్బరాజు, సునీల్, విక్రమ్‌జీత్ విర్క్, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జ్యోతి కృష్ణతో పాటు క్రిష్ జగర్లముడి దర్శకత్వం వహించారు. ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ, తోట తరణి ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరించారు. ఎ.ఎం. రత్నం ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.




## ఓటీటీలోకి వచ్చిన కమల్ బిగ్గెస్ట్ డిజాస్టర్

యూనివర్సల్ హీరో కమల్ హాసన్, లెజెండరీ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో తెరకెక్కిన భారీ చిత్రం ''థగ్ లైఫ్''. త్రిష కథానాయికగా, నటుడు శింబు కీలక పాత్రలో నటించిన ఈ చిత్రం భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రంకి థియేటర్లలో మాత్రం ఆశించిన స్పందన రాకపోవడంతో మొదటి రోజు నుంచే ఫ్లాప్ టాక్‌ను ఎదుర్కొంది. దీనితో ఈ సినిమా త్వరగా ఓటీటీకి వస్తుందని వార్తలు గుప్పుమన్నాయి. ఇప్పుడు అవి నిజమయ్యాయి. ''థగ్ లైఫ్'' చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్ ఓటిటీలో ముందుగానే విడుదల చేసింది. మొదట హిందీ వెర్షన్ ఆలస్యంగా రానుందని వార్తలు రాగా, అదే సమయంలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ ప్రారంభమైంది.

# 14నుంచి కొత్త రేషన్‌కార్డులు

ఈ నెల 14న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తెల్ల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మండల కేం ద్రంలో ఈ కార్యక్రమం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. నల్లగొండ కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. అర్హులైన లబ్ధిదారుల ధరఖాస్తులన్నింటినీ ఈ నెల 13 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ తెల్లరేషన్ కార్డుల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తోందని అన్నారు. ఎటువంటి వివక్ష లేకుండా అర్హులైన పేదలకు తెల్లరేషన్ కార్డుల మంజూరు ఉంటుందని భరోసా ఇచ్చారు. 2014లో తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి 89.73 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కేవలం 49 వేల తెల్ల రేషన్ కార్డులు




మంజూరు చేశారని అదీ కూడా ఉప ఎన్నికలు వచ్చినప్పుడు లబ్ధి పొందేందుకు మాత్రమే చేశారని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం లక్షలాది మంది అర్హులైన నిరుపేదలకు కొత్త తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయలేక పోయిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి వేసిన చారిత్రకపు అడుగు తెల్ల రేషన్ కార్డుల మంజూరు అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర జనాభాలో 3.10 కోట్ల మందికి అంటే 84 శాతానికి సన్న బియ్యం చేరుతున్నాయని అన్నారు.సాలీనా సన్నబియ్యంపై తమ ప్రభుత్వం రూ.13 వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. భూసేకరణ అంశంలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని హితవు పలికారు. ఎస్ఎల్‌బిసి పనులను పునః ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జైవీర్ రెడ్డి, బాలు నాయక్, వేముల వీరేశం, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, ఆయా జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, నందలాల్ తేజస్ పవర్, మంత్రిప్రగడ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

# హాట్ రకుల్

సోషల్ మీడియాలో ఓ టాలీవుడ్ హీరోయిన్ చిన్ననాటి ఫోటో తెగ వైరలవుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ వయ్యారి. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగులో ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, నాగార్జున, సాయి ధరమ్ తేజ్ వంటి స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. అయితే టాలీవుడ్ ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్ గా వరుస హిట్లతో దూసుకుపోయిన రకుల్.. కొన్నాళ్లుగా సైలెంట్ అయ్యింది. చివరగా ఆమె అయలాన్, భారతీయుడు చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం హిందీలో వరుస సినిమాలు చేస్తుంది.ఇటీవలే తన ప్రియుడు నిర్మాత జాకీ భగ్నానితో ఏడడుగులు వేసింది రకుల్. పెళ్లి తర్వాత కూడా ఇండస్ట్రీలో సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంటుంది. కానీ టాలీవుడ్ ఇండస్ట్రీలో ఈ బ్యూటీకి అంతగా అవకాశాలు రావడం లేదు.





## రామాయణ ఫస్ట్ గ్లింప్స్

ప్రస్తుతం భారీ అంచనాలు నెలకొన్న సినిమా రామాయణ. బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్, సాయి పల్లవి సీతారాములుగా కనిపించనున్నారు. ఇక కన్నడ స్టార్ యశ్ ఇందులో రావణుడి పాత్రలో నటిస్తున్నారు. అలాగే టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలలోని పలువురు స్టార్స్ రామాయణ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నామని ఇదివరకే మేకర్స్ ప్రకటించారు. మొదటి భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయగా.. 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది. అయితే ఈ మూవీ సెట్స్ నుంచి లీక్ అయిన ఫోటోస్ మూవీపై మరింత ఆసక్తిని కలిగించాయి. ఇక తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. తాజాగా విడుదలైన వీడియోలో వీఎఫ్ఎక్స్, బీజీఎమ్ ఆకట్టుకుంటున్నాయి. ''కాలం ఉనికిలో ఉన్నప్పటి నుంచి త్రిమూర్తులు ముల్లోకాలను పరిపాలిస్తున్నారు. బ్రహ్మ.. సృష్టించే దేవుడు, విష్ణువు.. రక్షించే దేవుడు, శివుడు.. అంతం చేయగలిగే దేవుడు.. కానీ వారి సృష్టి మూడు లోకాలపై ఆధిపత్యం కోసం ఎదురుతిరిగినప్పుడు అన్ని యుద్ధాలను అంతం చేసే యుద్ధం ప్రారంభమైంది. 5000 సంవత్సరాల నుంచి 2500 కోట్ల మంది ప్రజలచే ఆరాధించబడుతున్నది. ఇది ఒక అమరమైన ఇతిహాస గాథ.. రాముడు vs రావణుడు, రావణుడు.. శక్తి, ప్రతీకారం. రాముడు.. ధర్మం, త్యాగం. రణబీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా, సాయి పల్లవి సీతగా, రవి దుబే.. లక్ష్మణుడిగా, సన్నీ డియోల్.. హనుమంతుడిగా, సంగీతం హన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్. రచయితా శ్రీధర్ రాఘవన్, దర్శకత్వం నితేశ్ తివారీ.'' అంటూ వీడియోతో పాత్రలతో క్లారిటీ ఇచ్చారు. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆద్యంతం సినిమాపై అంచనాలు పెంచేసింది. ఇక రాముడిగా రణబీర్ కపూర్, రావణుడిగా యష్ లుక్స్ అదిరిపోయాయి. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది దీపావళి కానుకగా రిలీజ్ చేయనున్నారు.

# ఎవరికీ భయపడేది లేదు

క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉన్నా తనను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. పనిచేసే వారిపైనే రాళ్లు విసురుతారని చెప్పారు. నడిచే ఎద్దునే పొడుస్తారన్నారు. 44 ఏండ్లుగా ఇది కొనసాగుతూనే ఉన్నదని తెలిపారు. తాను వెనుకబడిన వర్గాల ప్రతినిధినని, బీసీ కార్డును పట్టుకునే బతుకుతున్నానని వెల్లడించారు. తన సతీమణి, మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన హైదరాబాద్ హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రూప్ రాజకీయ పరిణామాలపై వివరించారు. తాజా పరిణామాలపై 16 పేజీల లేఖ అందించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'నేను వెనుకబడిన వర్గాల ప్రతినిధిని. ఒకరి గురించి నేను కామెంట్ చేయను.



నాకు ప్రజాబలం ఉంది. చాలా కేసులకే నేను భయపడలేదు. నాకు భయం లేదని ముందు నుంచీ చెబుతూనే ఉన్నా.నేను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా. పేదల సమస్యలు పరిష్కరిస్తాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు. పనిచేసే వారిపైనే కొందరు రాళ్లు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు. నేను ఎవరికీ భయపడేది లేదు. నాకు ఎలాంటి గ్రూపు రాజకీయాలతో సంబంధం లేదు. వరంగల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కాంగ్రెస్ వచ్చేలా చూస్తాం. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చినా గెలిపించే బాధ్యత తీసుకుంటానని మీనాక్షి నటరాజన్‌తో చెప్పా. మా సేవల్ని పార్టీ ఉపయోగించుకోవాలని కోరాం. పార్టీకీ మీ సేవలు అవసరమని మీనాక్షీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా లక్ష్యం. రేవంత్‌రెడ్డిని ఇంకో పదేండ్లు ముఖ్యమంత్రిగా చూడాలి. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు అండగా నిలుస్తా.' అని మురళి చెప్పారు.

### నేడు పాశమైలారం సిగాచి పరిశ్రమకు

# నిపుణుల కమిటీ

పటాన్ చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు పెను విషాదం నింపిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు53 మంది మరణించారు. మరో 34 మంది వివిధ దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. కాగా ప్రమాద ఘటనపై ప్రభుత్వం విచారణకు నలుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గురువారం నిపుణుల కమిటీ సిగాచి పరిశ్రమను సందర్శించనుంది. ఈ సందర్భంగా కార్మికుల భద్రత కోసం సిగాచి పరిశ్రమ నిబంధనలు పాటిస్తుందా ? లేదా అనే అంశంపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తున్నట్టు తెలిసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తున్నట్లు సమాచారం.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## ఆస్పత్రిలో ఫిష్ వెంకట్.. సాయం కోసం కుమార్తె విజ్ఞప్తి

టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. వెంకట్ ఆరోగ్యం మరింత క్షీణించిందని, ఎదుటి వ్యక్తిని గుర్తుపట్టలేనంత తీవ్ర అనారోగ్యంతో ఉన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రస్తుతం బోడుప్పల్‌లోని ఆర్బీఎం ఆస్పత్రిలో వెంకట్ చికిత్స తీసుకుంటున్నారు. అయితే అతడి కిడ్నీలు మార్చిడి చేయకపోతే అతడు బతకడం కష్టమని వైద్యులు తెలిపినట్లు వెంకట్ కూతురు స్రవంతి వెల్లడించింది. ప్రస్తుతం తాము వైద్య సేవలు పొందలేని దీన స్థితిలో ఉన్నామని, దాతలు ఎవరైనా తమకు సాయం చేయాలని స్రవంతి కోరుతున్నారు. ఫిష్ వెంకట్ గత కొద్ది నెలలుగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో గతంలో డయాలసిస్ చికిత్స తీసుకున్నారు. అయితే ప్రస్తుతం వెంకట్ ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఐసీయూలో చేర్చారు కుటుంబసభ్యులు. గతంలో ఫిష్ వెంకట్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవర్ స్టార్ పవన్ కల్యాణ్ రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు.



## తగ్గనున్నజీఎస్‌టీ?

మధ్యతరగతి ప్రజలకు శుభవార్త, మధ్యతరగతి, అల్పాదయవర్గాలవారు ఎక్కువగా వినియోగించే వస్తువులు, ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. జీఎస్టీ విధానాన్ని మరింత సరళతరం చేసే లక్ష్యంతో 12శాతం జిఎస్టీస్లాబ్‌లో ఉన్నవస్తువుల్లో కొన్నింటిపై పన్ను పూర్తిగా తొలగించడం, 5శాతానికి తగ్గించాలని కేంద్రం ఆలోచిస్తోంది. మధ్యతరగతి, బలహీన వర్గాల వారు ఎక్కువగా ఉపయోగించే వస్తువులపైనే దృష్టి పెట్టా రు. పన్నుతగ్గనున్న వస్తువులలో టూత్‌పేస్ట్, టూత్‌పౌడర్, గొడుగులు, కుట్టుమిషన్లు, ప్రెషర్ కుక్కర్లు, వంట పాత్రలు, ఎలక్ట్రిక్ ఐరన్‌లు, గీజర్‌లు, తక్కువ సామర్థ్యం గల వాషింగ్ మిషీన్లు, సైకిళ్లు, 1000 రూపాయలకన్నా ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ వస్తువులు, 500 నుంచి 1000 రూపాయలలోపు ధరఉంటే చెప్పలు, స్టేషనరీ వస్తువులు, టీకాలు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణా లు, వంటి చాలా వస్తువులు ఉన్నాయి. ఈ చర్య వల్ల ప్రభుత్వం పై రూ.40 వేలకోట్ల నుంచి 50 వేల కోట్ల భారం పడుతుంది. అయితే ఈ భారాన్ని భరించేందుకు ప్రభుత్వం




సిద్ధంగా ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వస్తు వినియోగం పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు వచ్చింది. దీనివల్ల తక్కువ ధరలు అమ్మకాలు పెరుగుతాయని, చివరికి పన్ను బేస్, దీర్ఘకాలిక జీఎస్టీ వసూళ్లు పెరుగుతాయని కేంద్రం నమ్ముతోంది.కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ మధ్య ఓ ఇంటర్ వ్యూలో జీఎస్టీ రేట్లలో మార్పులు చేసే ప్రతిపాదన ఉందని సూచనప్రాయంగా తెలిపారు. ప్రభుత్వం హేతుబద్ధంగా ఆలోచిస్తోందని, చాలా వస్తువులపై పన్ను తగ్గించడం ద్వారా మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే అవకాశం ఉందని తెలిపారు.

## మామను పెళ్లి చేసుకోవాలని.. నవ వరుడిని చంపించి..

వివాహేతర సంబంధాలే భార్యభర్తల ప్రాణాలు తీస్తున్నాయి. మామతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉండడంతో నవ వరుడిని వధువు హత్య చేయించింది. ఈ సంఘటన బిహార్ రాష్ట్రం ఔరంగాబాద్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం_ _ _ గుంజాదేవి(20) అనే యువతి 45 రోజుల క్రితం ప్రియాంశును పెళ్లి చేసుకుంది. పెళ్లికి ముందే దేవీ మామ జీవన్‌సింగ్‌తో(55) అక్రమ సంబంధం పెట్టుకుంది. జీవన్‌ను పెళ్లి చేసుకుంటానని పలుమార్లు కుటుంబ సభ్యులకు చెప్పింది. కుటుంబ సభ్యులు బలవంతంగా ప్రియాంశుతో ఆమెకు పెళ్లి చేశారు. దీంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని భార్య తన ప్రియుడితో కలిసి ప్లాన్ వేసింది. మామ, గుంజాదేవి కలిసి సుపారీ గ్యాంగ్‌తో డీల్ కుదుర్చుకున్నారు. గత 25న ప్రియాంశు తన సోదరి ఇంటికి రైలులో వెళ్లాడు. నవీనగర్ స్టేషన్ నుంచి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలో అతడిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపారు. ప్రియాంశు ఘటనా స్థలంలోనే చనిపోవడంతో పోలీసులు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుంజాదేవి గ్రామం నుంచి పారిపోతుండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో పాటు కాల్ డేటాను పరిశీలించగా నిజాలు బయటకు వచ్చాయి. కోడలు, సుపారీ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జీవన్ సింగ్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

## సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికెళ్తున్నాం


ఈ ఏడాది ఎప్పుడూ లేని దిగుబడి వచ్చిందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. రైతులను అన్ని విధాల ఆదుకునే ప్రభుత్వం తమది అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కుప్పంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో ఆహారపు అలవాట్లు మారాయని, ఏ పంట పండిస్తే లాభదాయకమో కూడా ఆలోచిస్తున్నామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ పై చర్చిస్తున్నామని, మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటలసాగు చేయాలి అని రైతులకు సూచించారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయంలో లాభాలు పెరుగుతాయని అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికెళ్తున్నాం అని తెలియజేశారు. ఏమి చేయలేని వాళ్లే శవ రాజకీయాలు చేస్తుంటారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఏనాడైనా రైతులకు డ్రిప్ ఇరిగేషన్ ఇచ్చారా? అని గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాయసీమలో ఒకేసారి రూ.3,950 కోట్లు హంద్రీనీవాకు




డబ్బులిచ్చామని, మైక్రో ఇరిగేషన్ కు 90 శాతం సబ్సిడి ఇస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు ప్రాధాన్యత ఇస్తూ గిట్టుబాటు వచ్చేలా చేస్తున్నామని చెప్పారు. రైతుకు ఎక్కువ ఆదాయం రావాలని వాణిజ్య పంటలకు వెళ్లమని చెబుతున్నామని, అయితే ఒక్కోసారి వాణిజ్య పంటల్లో తక్కువ రేట్లు కూడా వస్తాయని అన్నారు. అనేక ఇబ్బందులను అధిగమించి ముందు కెళ్తున్నామని, ప్రభుత్వం ఒక్క ఆడబిడ్డకే అమ్మఒడి ఇచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఎంతమంది పిల్లలు ఉన్నా తాము తల్లికి వందనం ఇస్తున్నామని, అర్హులు ఎంతమంది ఉన్నా పింఛన్లు అందిస్తున్నామని అన్నారు. తాను ఎక్కడికెళ్లినా భూముల విషయం లోనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, చేయడం వల్ల జవాబుదారీతనం లేకుండా పోయిందని గత ప్రభుత్వాన్ని చంద్రబాబు విమర్శించారు.

## మానుషి చిల్లర్ హాట్ లుక్స్

హిందీ సినిమాల్లో సీనియర్ హీరోల సరసన కొత్త యంగ్ హీరోయిన్లు.. ఎంపిక చేసే ట్రెండ్ చాలా పాతది. చాలా మంది నటీమణులు తమ వయస్సు కంటే చాలా ఏళ్లు పైబడిన నటులతో తెరపై రొమాన్స్ చేస్తూ సినిమాల ప్రపంచంలోకి ప్రవేశించారు. అలాంటి నటి ఒకరు ఉన్నారు. పాపం సీనియర్ హీరోయిన్‌తో ఈ యంగ్ హీరోయిన్ రెండు సినిమాలు చేసిన వర్క్ అవుట్ కాలేదు.మానుషి చిల్లర్ మోడలింగ్‌తో తన కెరీర్‌ను ప్రారంభించింది. 2017లో 'మిస్ వరల్డ్' కిరీటాన్ని గెలుచుకుని యావత్ దేశం గర్వించేలా చేసింది. మోడలింగ్‌లో తనదైన ముద్ర వేసిన మానుషి 2022లో సినిమా ప్రపంచంలోకి అడుగుపెట్టింది. ఆమె మొదటి సినిమా అక్షయ్ కుమార్ తో 'సామ్రాట్ పృథ్వీరాజ్'. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ చక్రవర్తి పాత్రను అక్షయ్ కుమార్ పోషించారు. మానుషి చిల్లర్ 'సంయోగిత' పాత్రలో కనిపించింది. ఈ సినిమాలో ఆమె 50 ఏళ్లు పైబడిన నటుడితో రొమాన్స్ చేస్తూ కనిపించింది.





## కొత్త సినిమా కోసం విజయ్ కసరత్తులు

అగ్ర నటుడు విజయ్ దేవరకొండ తన కొత్త సినిమా కోసం కసరత్తులు మొదలుపెట్టాడు. ఇప్పటికే కింగ్‌డమ్ షూటింగ్‌ని పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేసిన విజయ్ ప్రస్తుతం ప్రస్తుతం జుట్టు పెంచి క్లీన్ షేవ్ మీసాలతో అదిరిపోయే లుక్‌లో కనిపిస్తున్నాడు. అయితే ఈ కొత్త లుక్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రాబోతున్న తన అప్‌కమింగ్ సినిమా కోసం అని తెలుస్తుంది. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రాబోతున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. రష్మిక కథానాయికగా నటించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం జూలై రెండో వారం నుంచి షూటింగ్ ప్రారంభించబోతున్నట్లు తెలుస్తుంది. దీనికోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తోంది చిత్ర బృందం. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రం 1854 — 1878 మధ్య కాలంలో రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథగా రాబోతుంది. ఈ సినిమాలో విజయ్ ఒక యోధుడిగా కనిపించబోతున్నాడు.

## రూ.150లకే 3BHK..

నటుడు సిద్ధార్థ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 3 BHK. ఈ సినిమాకు శ్రీ గణేష్ దర్శకత్వం వహిస్తుండగా.. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా రాబోతుండగా.. అరుణ్ విశ్వ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రబృందం. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. మంచి వ్యూస్ రాబడుతుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌ని డిఫరెంట్‌గా ప్లాన్ చేశారు మేకర్స్. 3BHK కొనాలంటే రూ. 75 లక్షలు అవసరం లేదు.. కేవలం రూ.150 చాలంటూ వినూత్నంగా ప్రమోషన్స్ చేస్తుంది చిత్రయూనిట్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక మధ్యతరగతి కుటుంబం సొంత ఇల్లు కొనడానికి పడే పాట్లను, వారి కలలను ఆవిష్కరించే భావోద్వేగభరితమైన కుటుంబ డ్రామాగా రాబోతుంది.




## ఏసీబీ విచారణకు ఐఏఎస్ అరవింద్ కుమార్

ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఏసీబీ ఎదుట హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి మూడోసారి ఏసీబీ విచారణకు వచ్చారు ఐఏఎస్. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో నిధుల బదలాయింపులో అరవింద్ కుమార్ కీలక పాత్ర పోషించారని ఏసీబీ గుర్తించింది. హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా పని చేస్తూ నిధులను మళ్లించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కేబినెట్ అనుమతి లేకుండా నిధులను బదిలాయించినందుకు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా ఇప్పటికే రెండు సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. జూన్ 16న కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తోంది. ఎఫ్ఈవో కంపెనీకి దాదాపు రూ.45 కోట్లు 71 లక్షల నగదును బదిలీ చేశారు. వాటికి సంబంధించే మూడోసారి అరవింద్ కుమార్‌ను విచారణకు పిలిచి ఏసీబీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తోంది.





## మేడిగడ్డకు పోటెత్తిన వరద

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్పల్లి గ్రామంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మహారాష్ట్రలోని ప్రాణహిత నది, తెలంగాణలోని గోదావరి నదుల ప్రవాహం పెరుగుతున్నది. బుధవారం బరాజ్ ఇన్ ఫ్లో 31,900 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా, గురువారం ఉదయానికి అది 71,900 క్యూసెక్కులకు చేరింది. దీంతో బరాజ్‌లోని మొత్తం 85 గేట్లను ఎత్తి అంతే మొత్తంలో వరద నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్‌లో ప్రస్తుత వరద ప్రవాహం సముద్ర మట్టానికి 89.40 మీటర్ల ఎత్తులో ఉన్నదని అధికారులు వెల్లడించారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.